ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి

◆ **పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి**

గండీడ్, డిసెంబర్ 18 : గండీడ్, మహ్మదాబాద్ మండలాలను చార్మినార్ జోన్‌లో కలిపేందుకు కృషి చేస్తానని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం ఎంపీపీ మాధవి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయ న ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పరిగి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి అధికారులు దృష్టి పెట్టాలని తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచులు గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఈశ్వరయ్యగౌడ్, పీఏసీసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, కోఆప్షన్ సభ్యుడు సలీం, తాసీల్దార్లు నాగలక్ష్మి, యేసయ్య, ఎంపీడీవో రూపేందర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు ఉన్నారు.

మున్సిపాలిటీ శుభ్రంగా ఉండాలి

మహబూబ్‌నగర్, డిసెంబర్ 18 : పట్టణ పరిధిలో ఏ వార్డు చూసినా పరిశుభ్రంగా ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంజినీరింగ్ పనులతోపాటు వార్డుల్లోని కాలువలు, రోడ్లు అన్ని పరిశుభ్రంగా ఉండాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్‌టౌన్, డిసెంబర్ 18 : స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ ఆ ధ్వర్యంలో సోమవారం స్టేడియం మైదానంలో ఉమ్మడి జిల్లా అం డర్-14, 17 బాల, బాలికల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు నిర్వహించారు. ఎంపికలను జిల్లా కబడ్డీ సంఘం సెక్రటరీ కురుమూర్తి ప్రారంభించారు. కాగా అండర్-14 బాలుర జట్టుకు శైలేశ్వర్, హుస్సేన్, రాణే, జీవన్, అమీర్ అహ్మద్, హైదర్‌అలీ, సిరాజుద్దీన్, సాయికృష్ణ, చంద్రశేఖర్, మీర్‌అంజద్‌అలీ, షేక్‌రహెమాన్, అతీఫ్, మహేశ్, గాంధీప్రసాద్, గౌతమ్, పవన్ కుమార్ ఎంపికయ్యారు. బాలికల జట్టుకు హర్షిత, వైష్ణవి, హరిణి, శారద, సాయిదర్శిని, హ రిక, మిస్బసిద్దిఖీ, స్పందన, బద్రునీస, సింధు, సాయిదీపిక, సబ, మహేశ్వరి, కీర్తన, అండర్-17 బాలుర జట్టుకు మల్లేశ్, రాజు, రాకేశ్, నరేశ్, సురేశ్, శివప్రసాద్, వంశీ, అరవింద్, కే,అరవింద్, హర్షవర్ధన్, నాగరాజు, కార్తీక్, పరశురాములు, శివరాజు ఎంపికయ్యారు. బాలికల-17 జట్టుకు గంగా, శిరీష, సావిత్రి, ఇందిర, నీహారి క, రజిత, శ్రావణి, స్పందన, జ్యోష్ణ ఎంపికయ్యారు. కార్యక్రమంలో పేట టీఎస్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మూసాపేట(అడ్డాకుల), డిసెంబర్ 18 : పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటు చేసుకున్నట్లు అడ్డాకుల ఎస్సై మాధవరెడ్డి తెలిపారు. అడ్డాకుల మండలం వర్నె గ్రామానికి చెందిన రాగుల సాయిలు (48) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మానసస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేసినట్లు తెలిపారు. అతని భార్య వెంకటమ్మ గుర్తించి మహబూబ్‌నగర్ జిల్లా దవాఖానకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వేణుగోపాల్‌కు డాక్టరేట్

మహబూబ్‌నగర్, డిసెంబర్ 18 : పాలమూరు విశ్వవిద్యాలయం పీజీ సెంటర్ గద్వాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న శ్రీవైష్ణవ వేణుగోపాల్ కాశీ హిందూ విశ్వవిద్యాలయం 103వ స్నాతకోత్సవంలో డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసిలో కాశీ హిందూ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య బీ.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో తెలుగు సాహిత్యంలో సరస్వతి-పరిశీలన అనే అంశంపై పరిశోధనలో వేణుగోపాల్‌కు డాక్టరేట్ వచ్చింది.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

మహబూబ్‌నగర్‌టౌన్, డిసెంబర్ 18 : ఆసిఫాబాద్‌లో ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ ఖోఖో టోర్నీలో పాల్గొని జిల్లా బాలికల జట్టుకు జిల్లా కేంద్రంలోని కొనపాలమూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని హరిక ఎంపికైంది. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్ఎం డెబోరా విద్యార్థినిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రస్థాయి టోర్నీలో ప్రతిభ చాటి జట్టు విజయానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

నవాబ్‌పేట, డిసెంబర్ 18 : మండలంలోని కొల్లూరులో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేం ద్రంలో ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గ్రామ శివారులో ఏర్పాటు చేసిన కేంద్రానికి రైతులు భారీగా ధాన్యం తీసుకువస్తున్నారు. ఇప్పటి వరకు 10 వేల బస్తాలు ధాన్యం కొనుగోలు చేసినట్లు విండో డైరెక్టర్ నాగ అంజయ్య తెలిపారు.

ప్రతి సమస్యనూ పరిష్కరించాలి

◆ **కలెక్టర్ రవినాయక్**

మహబూబ్‌నగర్, డిసెంబర్ 18 : ప్రతి సమస్యనూ పరిష్కరించాలని జిల్లా, మండల అధికారులను కలెక్టర్ రవినాయక్‌ను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణికి సంబంధించిన సమస్యలతోపాటు మున్సిపల్ అనుమతులు, ఇతర ధ్రువపత్రాల జారీ, ఉపాధి, ఉద్యోగం వంటి అంశాలపై ఫిర్యాదులు రాగా ఆయా సందర్భాల్లో సంబంధిత అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా సంభాషించారు. అలాగే మండల అధికారులతో వీసీ ద్వారా కలెక్టర్ మాట్లాడారు. ప్రజా వాణికి అత్యధికంగా భూముల సమస్యలతో కూడిన ఫిర్యాదులు వస్తున్నట్లు, ప్రతి ఫిర్యాదుకు పరిష్కార మార్గం చూపించాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, జెడ్పీ సీఈవో జ్యోతి ఉన్నారు.

ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ రవి నాయక్

రక్తదానం జీవనదానం

జడ్చర్లటౌన్, డిసెంబర్ 18 : రక్తదానం జీవనదానమని కలెక్టర్ రవినాయక్ అన్నారు. విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి సేవాభావంతో తమ వంతు బాధ్యతగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు. ఇండియన్ రెడ్ క్రాస్ మహబూబ్‌నగర్ సొసైటీ, నిమ్స్ యూనివర్సిటీ నిశ్చయ ఆధ్వర్యంలో సోమవారం జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లోని నిమ్స్ యూనివర్సిటీలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం జీవనదానమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. శిబిరంలో రక్తదానం చేసిన 150 మంది రక్తదాతలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం ఎస్వీకేఎం పాఠశాలలను ఆయన సందర్శించారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో పలు విషయాలను గురించి చర్చించారు. తరగతిగదులు, ఐసీటీ కంప్యూటర్ ల్యాబ్, ఆడిటోరియం, కెఫెటేరియా, ఆవుట్‌డోర్, ఇండోర్‌ప్లేగ్రౌండ్, డ్యాన్స్ స్టూడియో, నర్సింగ్‌స్టేషన్, లైబ్రేరీ, ఆర్ట్‌స్టూడియోను సందర్శించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందిస్తున్న పాఠశాల నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో జాతీయ రహదారుల నిర్వాహణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ దీప, నిమ్స్ యూనివర్సిటీ డిప్యూటీ రిజిస్ట్రార్ మహేశ్‌కుమార్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ నటరాజ్, ఎస్వీకేఎం పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేయాలి

మహబూబ్‌నగర్, డిసెంబర్ 18 : జూరాల నుంచి అధనంగా ఒక్క టీఎంసీ నీరును కోయిల్‌సాగర్ ప్రాజెక్టును నింపేందుకుగానూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని, అనుమతులు వచ్చిన వెంటనే నీరును విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రవి నాయక్ అన్నారు. ఉపాధి హామీ పథకం కింద ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాలువల్లోని ఒండ్రు మట్టిని, చెట్లను తొలగింపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా నీటి పారుదల సలహా బోర్డ్ సమావేశంలో కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కింద 2023-24 యసంగికి సాగునీటి విడుదలపై జిల్లా సమావేశంలో వారు మాట్లాడారు. 2023-24 యాసంగికి ఇప్పటికే నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం కాకుండా సవరించిన షెడ్యూల్ ప్రకారం సాగునీటి విడుదల చేసేందుకు అలాగే ప్రాజెక్టు కింద ఆయకట్టు అంతటికి సాగునీరు అందేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ జనవరి మొదటి వారం నుంచి ఏప్రిల్ మూడో వారం వరకు నీరుఇచ్చేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలన్నారు. అనంతరం జెడ్పీ చైర్పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కోయిల్‌సాగర్ కింద యాసంగిలో ఎలాంటి సమస్యలు లేకుండా పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్వపు చైర్మన్ ఉమా మహేశ్వరెడ్డి గత సంవత్సరం 32 ఫీట్ల సాగునీరు ప్రాజెక్టులో ఉందని, ఈ సంవత్సరం సైతం అంతే నీరు ఉన్నందున 4 నుంచి 5 తడులకు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. క్రాస్ రెగ్యులేటరిలు ఏర్పాటు చేయాలని కోయిల్‌సాగర్ ద్వారా మహబూబ్‌నగర్‌కు 0.36 టీఎంసీల నీటిని మిషన్ భగీరథ కింద ఇవ్వకుండ శ్రీశైలం తిరుగుజాలాల నుంచి ఇచ్చేలా భవిష్యత్తులో చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హర్షవర్ధన్‌రెడ్డి, చిన్న నీటి పారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ చక్రధరం, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఆర్డీవో అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

భూత్పూర్‌లో..

భూత్పూర్, డిసెంబర్ 18 : కొత్తగా అధికారంలోకి ప్రభుత్వం దశ ల వారీగా ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక తాసీల్దార్ కార్యాలయం లో 75మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ రాజు, డీటీ గీత, ఆర్ఐలు సత్తయ్య, వెంకటేశ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పోల్కంపల్లిలో హైనా సంచారం

అడుగు జాడలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

మూసాపేట, డిసెంబర్ 18 : మండలంలోని పోల్కంపల్లి గ్రామ సమీపంలో హైనా సంచరిస్తున్నట్లు అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు తెలిపారు. పోల్కంపల్లి గ్రామ సమీపంలోని గుట్టలో చిరుత పులి సంచరిస్తున్నట్లు గ్రామస్తులు కలకలం సృష్టించారు. స్థానికులు కథనం మేరకు గ్రామంలో దేవుని గుట్ట పరిసరాల్లో వారం రోజులుగా చిరు త పులి సంచరిస్తుందని పుకారు వ్యాపించింది. ఆదివారం అంతాయపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు అటుగా వెళ్తున్న హైనాను చూసి పులి అనుకొని గ్రామస్తులకు తెలిపాడు. దీంతో గ్రామస్తులంతా కలిసి గుట్ట పరిసరాలను పరిశీలించగా జాడలు కనిపించడంతో గ్రామపెద్దలు మూసాపేట ఎస్సై శ్రీనివాసులు కు సోమవారం సమాచారం అందించారు. ఎస్సై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో ఆటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి ఆడుగు జాడలను పరిశీలించి అది చిరుత పులి కాదని హైనాగా చెప్పారు. ఆ పరిసరాల్లో రాత్రి సమయంలో ఎవరు ఒంటరిగా ఉండొద్దని, పశువులను, మేకలను ఉంచకూడద ని చెప్పారు. రాత్రి సమయంలో ఇంట్లోనే ఉండాలని స్థానికులకు సూచించారు.

చర్యలు తీసుకోవాలి

మహబూబ్‌నగర్, డిసెంబర్ 18 : భూత్పూర్ మండలంలోని ఎన్‌హెచ్ 44 సమీపంలోని సర్వే నెంబర్ 131, 132లోని పోతులమడుగు గ్రామ శివారులో బీరప్ప గుడిని కం దరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కూల్చరని వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌ను సోమవారం శ్రీమల్లన్న గొర్రెల కాపరుల సంఘం నేతలు కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్, మల్లేశ్‌యాదవ్, చెన్నయ్య ఉన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీలు

జడ్చర్లటౌన్, డిసెంబర్ 18 : మున్సిపాలిటీ పరిధిలోని గీతశ్రీ పాఠశాలలో సంస్కారభారతి ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల విద్యార్థులకు భగవద్గీత కంఠస్థ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సంస్కారభారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ, పాఠశాల యాజమాని శంకర్‌రెడ్డి, హెచ్ఎం బాలరాజు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం

కొత్తకోట, డిసెంబర్ 18 : సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకొని సోమవారం శ్రీదత్త కోటిలింగేశ్వర ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

22 నుంచి వెబ్ ఆప్షన్ల ప్రక్రియ

పాలమూరు, డిసెంబర్ 18 : ఉమ్మడి మహబూబ్‌నగర్ డీఈఈసెట్ 2023లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు 2023-25 విద్యా సంవత్సరం మొదటి సంవత్సరానికి సంబంధించి తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియాల్లో ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఆప్షన్స్ పెట్టుకోవాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ మేరాజుల్లాఖాన్ సోమవారం ప్రకటనలో తెలిపారు. అంతకుముందు ఈనెల 20వ తేదీన ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని, విద్యార్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో జిరాక్స్ ధ్రువపత్రాలను జతచేసుకొని హాజరుకావాలని కోరారు. వివరాలకు 9949993714ను సంప్రదించాలని తెలిపారు.

దరఖాస్తులకు ఆహ్వానం

పాలమూరు, డిసెంబర్ 18 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రతిభ కళాశాల సీవోఈలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో చేరేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గురుకుల ప్రాంతీయ సమన్వయ అధికారిణి ఫ్లారెన్స్‌రాణి సోమవారం ప్రకటనలో తెలిపారు. అదే విధంగా కళాశాలలో ఐఐటీ, జేఈఈ, నీట్ పరీక్షల కోసం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు 2024 జనవరి 15వ తేదీ వరకు రూ.200రుసుము చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

5వ తరగతి ప్రవేశాలకు..

తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనకబడిన సంక్షేమ సాధారణ గురుకులాల్లో 2024-25 సంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో ప్రవేశాలకు ఉమ్మడి పరీక్ష నిర్వహిస్తున్నట్లు గురుకుల ప్రాంతీయ సమన్వయ అధికారిణి ఫ్లారెన్స్‌రాణి సోమవారం ప్రకటనలో తెలిపారు. అందుకు 2023-24 సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులని, విద్యార్థులు ఈనెల 18 నుంచి వచ్చే నెల జనవరి 6వ తేదీ వరకు www.tswreis.ac.in లేదా tgcet.cgg.gov.inలో రూ.100 పరీక్ష రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష 2024 ఫిబ్రవరి 11వ తేదీన ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

బొలెరో ఢీకొని వ్యక్తి మృతి

మహ్మదాబాద్, డిసెంబర్ 18 : ఎదురెదురుగా వస్తున్న బొలెరో వాహనం బైక్‌ను ఢీ కొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన గండీడ్ మండలంలో చోటు చేసుకున్నది. ఎస్సై సురేశ్ కథనం మేరకు వెన్నాచేడ్ గ్రామానికి చెందిన మైసగాళ్ల గోపాల్, కిష్టయ్యతో కలిసి మోటరు సైకిల్‌పై హన్వాడ మండలం టంకర గ్రామానికి వెళ్లి తిరిగివస్తుండగా గండీడ్ సమీపంలో కట్టెల మిషన్ సమీపంలో ఎదురుగా వస్తున్న బొలెరోను డ్రైవర్ అజాగ్రత్తతో నడుపుకుంటు వచ్చి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీ కొన్నాడు. దీంతో మైసగాళ్ల గోపాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనకాల ఉన్న కిష్టయ్యకు బలమైన గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నాడు. మృతుడి తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.